సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 1 । మార్చి । 2025



చీనీ టన్ను రూ.21,100

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.21,100, కనిష్టంగా రూ.6,200 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.10

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.7 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 225 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.

గరిష్ఠం/కనిష్ఠం
36.2°/13.4°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలితీవ్రత తగ్గగా... రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నాయి. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఎండుమిర్చి @ 14,500



మార్కెట్‌లో ఎండుమిర్చి క్రయ విక్రయాలు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం క్వింటా ఎండుమిర్చి గరిష్టంగా రూ.14,500 పలికింది. మార్కెట్‌కు 106.60 క్వింటాళ్ల ఎండుమిర్చి రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో మొదటి రకం మిర్చి క్వింటాకు గరిష్టంగా రూ.14,500, కనిష్టంగా రూ.8 వేలు, సగటున రూ.11 వేలు ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు. గత వారం క్వింటా గరిష్టంగా రూ.11 వేలు పలుకగా ఈ వారం 3,500 అధికంగా పలకడం విశేషం.


నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

పుట్టపర్తి టౌన్: ఇంటర్ వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభం కానున్నాయి. తొలిరోజు మొదటి సంవత్సరం, 3వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయి. ఈ నెల 20 నాటికి ముగుస్తాయి. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. జిల్లా నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులు 13,083 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 10,904 మంది మొత్తం 23,987 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరికోసం జిల్లా వ్యాప్తంగా 42 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, సెల్‌ఫోన్ దుకాణాలు మూసి వేయాలని ఆదేశించారు.

బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

- ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశాలతో దిగొచ్చిన విద్యుత్ శాఖ

మడకశిర: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిపై విద్యుత్‌తీగ తెగిపడి మృతి చెందగా.. బాధిత కుటుంబానికి ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశాలతో రూ.5 లక్షల పరిహారం దక్కింది. వివరాల్లోకి వెళితే... 2024 జూలై 27న మడకశిరకు చెందిన పెన్న ఓబిలేసు(39) వ్యక్తిగత పనిపై ద్విచక్రవాహనంలో ఇంటి నుంచి బయలుదేరాడు. యాదవ కల్యాణ మండపం వద్దకు చేరుకోగానే 11 కేవీ లైన్ విద్యుత్ తీగలు తెగి పెన్న ఓబిలేసుపై పడ్డాయి. విద్యుదాఘాతానికి గురైన పెన్న ఓబిలేసు అక్కడికక్కడే మృతి చెందారు. పెన్న ఓబిలేసు మృతితో ఆ కుటుంబం ఆర్థిక అండ కోల్పోయింది. ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా విద్యుత్ శాఖ స్పందించలేదు. దీంతో పెన్న ఓబిలేసు కుటుంబీకులు న్యాయం కోసం జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)ని ఆశ్రయించారు. స్పందించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించాలని గురువారం విద్యుత్ శాఖను ఆదేశించింది. దీంతో విద్యుత్‌శాఖ శుక్రవారం మృతుడి భార్య ఖాతాలో రూ.5 లక్షలు జమ చేసింది. తమ కుటుంబానికి నష్ట పరిహారం అందే విధంగా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ మృతుని భార్య కృతజ్ఞతలు తెలిపారు.



మాటలు ఘనం.. నిధులు శూన్యం

- బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి
- సూపర్ సిక్స్ పథకాలకూ అరకొర కేటాయింపులు
- పరిశ్రమల ఊసు లేదు.. కొత్త పెట్టుబడులూ లేవు
- హంద్రీ–నీవా ఆయకట్టు స్థిరీకరణకు రిక్తహస్తం
- పెనుకొండ మెడికల్ కళాశాల ఊసే లేదు
- కూటమి బడ్జెట్‌పై అన్ని వర్గాల్లోనూ తీవ్ర వ్యతిరేకత

అరకొర నిధులు.. అంకెల గారడీతో కూటమి సర్కార్ రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసింది. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏ రంగానికీ పూర్తి స్థాయిలో నిధులు కేటాయించలేకపోయింది. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, చేనేతలు... ఇలా ఏ వర్గానికీ సాయంగా నిలవలేకపోయింది. చివరకు సూపర్ సిక్స్ అంటూ గొప్పలు చెప్పిన పథకాలనూ విస్మరించడంతో అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రశాంతి నిలయం: కూటమి సర్కారు శుక్రవారం పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను నిరాశపరిచింది. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తామని ఊదరగొడుతూ వాటి అమలుకు మాత్రం అరకొర కేటాయింపులు చేసి ప్రజలను వంచించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు జీవనాడి హంద్రీ–నీవాకు కేటాయించిన రూ.3,243 కోట్లలో విద్యుత్ బిల్లులకే రూ.1,000 కోట్లు పోతుంది. హంద్రీ–నీవా పరిధిలోని ఆరు లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు నయాపైసా నిధులు కేటాయించలేదు. కేవలం లైనింగ్ పనుల రూపంలో నిధులు దండుకోవడమే లక్ష్యంగా కేటాయింపులు చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హంద్రీ–నీవా ఆయకట్టు స్థిరీకరణను విస్మరించి రైతులను దగా చేశారు. హెచ్చెల్సీ ఫేజ్–1, ఫేజ్–2కు కలిపి మొత్తం రూ.70 కోట్ల నిధులు కేటాయించారు. హెచ్చెల్సీ ఆధునికీకరణకు రూ.వందల కోట్ల నిధులు అవసరం కాగా.. అత్తెసరు నిధులు కేటాయించి అనంత రైతుకు తీరని వేదన మిగిల్చారు.

జిల్లాకు తీరని అన్యాయం..

బడ్జెట్‌లో శ్రీసత్యసాయి జిల్లాకు ప్రత్యేకించి ఎలాంటి నిధులు కేటాయించ లేదు. పెనుకొండలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణానికి కేటాయింపులు చేయలేదు. హిందూపురంలో పారిశ్రామికవాడ అభివృద్ధి ప్రస్తావనే లేదు. పుట్టపర్తిలో ఏర్పాటు కానున్న ఏపీఐఐసీ పార్కునూ విస్మరించారు. ఇక జిల్లాలో కొత్తగా పెట్టుబడుల ప్రస్తావనే పయ్యావుల బడ్జెట్ ప్రసంగంలో వినిపించలేదు.

పథకాలకూ అరకొరే...

ఎన్నికల హామీలనుకూటమి సర్కార్ గాలికి వదిలేసింది. మహిళల మహాశక్తి, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ప్రయాణాలకు పైసా ఇవ్వని ప్రభుత్వం.. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం పథకాలకు భారీగా కోత విధించింది. ఇక జిల్లాలో ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం కింద ఎంతమందికి ఆర్థిక సాయం అందిస్తారన్న దానిపై స్పష్టత లేదు. అన్నదాత సుఖీభవ పథకానికి గత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.1,000 కోట్లు కేటాయించినా.. పైసా విడుదల చేయలేదు. ఒక్కో రైతుకు రూ.20 వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తామని హామీలో పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5.65 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరికి ఏడాదికి రూ.20 వేల చొప్పున ఇవ్వాలంటే రూ.1,130 కోట్లు కావాలి. రాష్ట్రమంతటా రూ.6,300 కోట్లు ఇచ్చారు. ఈ నేపథ్యంలో అన్నదాత సుఖీభవ ఎందరికి అందుతుందో ప్రశ్నార్థకంగా మారింది.



పునాది స్థాయిలోనే ఉన్న పెనుకొండ మెడికల్ కళాశాల భవన నిర్మాణం

భృతి.. అంతా భ్రాంతి

ఇంటికో ఉద్యోగం.. లేదంటే నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. బడ్జెట్ కేటాయింపుల్లో నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1.84 లక్షల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. వారంతా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించి భృతి ఇస్తారని వేయి కళ్లతో ఎదురుచూసినా.. చివరకు నిరాశ తప్పలేదు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రస్తావనే లేకుండా ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రవేశపెట్టారు.

మహిళలకు మొండిచేయి

మహిళలకు ఈ బడ్జెట్‌లో మొండిచేయి చూపారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణమంటూ ఊరించినా.. బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదు. ఇక 19 నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామన్న హామీని కూడా విస్మరించారు. డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. 'దీపం–2.0' పథకం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితమంటూ ప్రకటించినా.. బడ్జెట్‌లో అందుకు తగ్గట్టుగా నిధులు కేటాయించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. 'తల్లికి వందనం' కింద ఏటా రూ.15 వేలు ఎందరికి ఇస్తారన్న దానిపై స్పష్టత లేకుండా పోయింది. జిల్లాలో 1 నుంచి పదో తరగతి వరకు 2.39 లక్షల మంది చదువుతుండగా... ఎందరికి లబ్ధి చేకూరుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

బీసీలను మోసం చేశారు



బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ మొండి చేయి చూపారు. కూటమి నాయకుల హామీలకు అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు ఏమాత్రం పొంతన లేదు. నిధులు కేటాయించకుండా బీసీల సంక్షేమానికి పాతర వేశారు. బీసీలపై ప్రేమ ఉంటే 45 ఏళ్లకే పింఛన్ హామీని అమలు చేసేందుకు బడ్జెట్‌లో ఎందుకు నిధులు కేటాయించలేదు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఇందుకు సమాధానం చెప్పాలి. బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గానే కూటమి ప్రభుత్వం చూస్తోంది. ప్రజా సంక్షేమాన్ని, సూపర్ సిక్స్‌ను పక్కన పెట్టింది.

– ఉషశ్రీ చరణ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు

చేనేతలకు తీవ్ర అన్యాయం



రాష్ట్ర బడ్జెట్ అంతా అంకెల గారడీ. ఏ ఒక్కరికీ ఉపయోగం లేదు. చేనేత రంగానికి సరిపడా నిధులు కేటాయించకుండా నేతన్నలకు తీవ్ర అన్యాయం చేశారు. పెరిగిన ముడిపట్టు ధరలు, పట్టుచీరలకు మద్దతు ధర లేక చేనేత కార్మికులు అవస్థలు పడుతుంటే ఆదుకునేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 'నేతన్న నేస్తం' ద్వారా ఏటా ఒక్కో చేనేత కుటుంబానికి రూ.24 వేలు ఇచ్చాం. ప్రస్తుతం ఆ పథకాన్ని చంద్రబాబు అటకెక్కించారు.

–కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే

విద్యారంగాన్ని విస్మరించారు



బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించారు. బడ్జెట్‌లో ప్రభుత్వ విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ చేసిన సూచనలు పూర్తిగా విస్మరించారు. పాఠశాల విద్యాశాఖకు బడ్జెట్‌లో 9.86 శాతం మాత్రమే నిధులు కేటాయించడం అన్యాయం. 'నాడు–నేడు' పెండింగ్ పనుల గురించి బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించ లేదు. మోడల్ ప్రైమరీ స్కూళ్లకూ ఎలాంటి నిధులు కేటాయించ లేదు. 12వ పీఆర్సీ, ఆర్థిక బకాయిలు చెల్లింపు ఊసే లేకపోవడం అన్యాయం.

– శెట్టిపి జయచంద్రారెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

ఇదో గాలి బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాల వారికి అన్యాయం జరిగింది. లెక్కలు ఫుల్, ఖజానా నిల్ అన్న చందంగా బడ్జెట్ విమర్శల పాలైంది. బడ్జెట్‌లో జిల్లాకు భారీగా నిధులు వస్తాయని ఆశిస్తే నిరాశ ఎదురైంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ గురించి స్పష్టత లేదు. ఇదో గాలి బడ్జెట్. చంద్రన్న బీమా పథకాన్ని పక్కన పెట్టేశారు. కౌలు రైతులను పూర్తిగా విస్మరించారు.

– వేమయ్య యాదవ్, సీపీఐ జిల్లా కార్యదర్శి

టీడీపీ X బీజేపీ

- ముదిగుబ్బ ఎంపీపీ వాహనంపై టీడీపీ శ్రేణుల దాడి
- వాహనంలోని వ్యక్తులను బయటకు లాగి కొట్టిన వైనం

ముదిగుబ్బ: మండలంలో టీడీపీ, బీజేపీ నాయకుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. శుక్రవారం సంకేపల్లిలో గ్రామంలో బీజేపీకి చెందిన ఎంపీపీ ఆదినారాయణ వాహనాన్ని టీడీపీ శ్రేణులు అడ్డుకుని దాడి చేశారు. వాహన అద్దాన్ని ధ్వంసం చేశారు. గురువారం వీరనారాయణస్వామి పరుషలో ఎంపీపీ ఆదినారాయణ అనుచరులు టెంకాయల వ్యాపారి మల్లికార్జునపై దాడి చేసిన విషయం విధితమే. అతను టీడీపీకి చెందిన వ్యక్తి కావడంతో ఆ పార్టీ నాయకులు దాడిని తీవ్రంగా పరిగణించారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఎంపీపీ ఆదినారాయణ స్వగ్రామం బి.కొట్టాల నుంచి ముదిగుబ్బకు బయలుదేరారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు మార్గమధ్యంలోని సంకేపల్లిలో కాపుకాసి వాహనంపై దాడి చేశారు. అద్దాన్ని పగులగొట్టారు. వాహనంలోని వీరాంజి, ఉపేంద్ర అనే వ్యక్తులను బయటకు లాగి కొట్టారు. ఎంపీపీ మాత్రం వాహనంలోనే ఉండిపోయారు. వీరనారాయణస్వామి పరుషలో మల్లికార్జునపై ఎందుకు దాడి చేశారంటూ భార్యతో పాటు బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన గురించి తెలుసుకున్న పోలీసులు వెంటనే సంకేపల్లికి చేరుకుని గుంపులను చెదరగొట్టారు. ఎంపీపీని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ ముదిగుబ్బకు చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు.



సంకేపల్లిలో ఎంపీపీ వాహనాన్ని చుట్టుముట్టిన టీడీపీ శ్రేణులు (ఇన్‌సెట్) ఎంపీపీ వాహన అద్దాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

ప్రశాంతి నిలయం: జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చేతన్ ఆర్డీఓలను ఆదేశించారు. ఇందుకోసం డివిజన్ స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మార్చి 1వ తేదీ నుంచి 3వ తేదీలోపు పంపిణీ చేయాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ టీఎస్ చేతన్

సారా రహిత జిల్లానే లక్ష్యం..

'నవోదయం 2.0' ను జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తూ నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో 'నవోదయం 2.0'పై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. నాటుసారా వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించాలన్నారు. అనంతరం నవోదయం 2.0 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ నాగ మద్దయ్య, ఏసీ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీహోమం



హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

లేపాక్షి: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో శనివారం దుర్గాదేవి అమ్మవారికి చండీహోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి పర్యవేక్షణలో వేదపండితులు సునీల్‌శర్మ హోమ క్రతువును నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. రాక్షస సంహారం కోసం దుర్గాదేవి చండీగా అవతరించారని అర్చకులు తెలిపారు. చండీయాగం వల్ల గ్రామానికీ మంచి జరుగుతుందన్నారు. అనంతరం వేదపండితులు హోమాలు నిర్వహించి అమ్మవారి ఉత్సవ విగ్రహంతో ఆలయం చుట్టూ ప్రదిక్షణ చేశారు. అనంతరం శివపార్వతులను సింహవాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు లీలావతి, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



ప్రదక్షిణ చేస్తున్న పండితులు, గ్రామపెద్దలు

సిద్ధేశ్వరా.. కరుణజూపరా



సిద్ధేశ్వరస్వామిని అలంకరించిన దృశ్యం



అగ్నిగుండ మహోత్సవానికి పోటెత్తిన భక్తులు

- వైభవంగా సిద్ధేశ్వరస్వామి అగ్నిగుండ మహోత్సవం
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- నవధాన్యాలు, వివిధ పంటలు స్వామివారికి సమర్పణ

హేమవతి(అమరాపురం): సిద్ధేశ్వరనామం ప్రతిధ్వనించింది. భారీగా తరలివచ్చిన భక్తులతో హేమావతి క్షేత్రం జనసాగరమైంది. 'సిద్ధేశ్వరా కరుణజూపరా...మానవాకారా మము బ్రోవరా' అంటూ భక్తులు అర్థించగా... చల్లంగ చూడు స్వామి అంటూ రైతులు తాము సాగు చేసిన పంటలను భక్తితో సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం హేమావతిలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వర స్వామి అగ్నిగుండ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం మానవాకారుడైన సిద్ధేశ్వర స్వామికి అర్చకులు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలతో ఆలయానికి కుడివైపున ఉన్న అగ్నిగుండం వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. అనంతరం అర్చకులు, ఉత్సవ కమిటీ చైర్మన్ కరేగౌడ, ఈఓ నరసింహరాజు తదితరులు ధూపం వేసి అగ్నిగుండ మహోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి నవధాన్యాలతో పాటు తాము పండించిన వేరుశనగ, చింతపండు, చింతకొమ్మలు, కందులు, దూపం, కొబ్బరి తదితర వాటిని అగ్నిగుండంలో వేశారు. ఇలా అగ్నిగుండం ద్వారా స్వామికి సమర్పించడం వల్ల కోర్కెలు నెరవేరుతాయని, పాడిపంటలకు ఇబ్బందులు ఉండవని ఇక్కడి వారి నమ్మకం. అందుకే ఏటా రైతులు తాము పండించిన పంటలో కొంతభాగాన్ని అగ్నిగుండం వేసి స్వామివారికి అర్పిస్తారు.



అగ్ని గుండంలోకి ధూపం వేస్తున్న భక్తులు

నేడు సిడిమానోత్సవం: సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి సిడిమాను ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఈఓ నరసింహరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కరేగౌడ తెలిపారు.